ఆస్వాదన సాహితీ గుబాళింపులు

- కొత్త తరానికి భాషా సౌందర్యాన్ని అందిస్తున్న సంస్థ
- 18 సంవత్సరాలుగా పలు సాహిత్య సేవలు



కాశీభట్ల సత్యనారాయణ రచించిన రుద్రం గ్రంథావిష్కరణ చేస్తున్న దివంగత దంటు సూర్యారావు తదితరులు (ఫైల్)



సురభారతీ సౌరభం సాహిత్య సదస్సులో పాల్గొన్న వేంకటసత్యనరసింహ శాస్త్రి, దుర్గాప్రసాద్ తదితరులు (ఫైల్)

కాకినాడ కల్చరల్: సాహితీ గుబాళింపులను కొత్తతరానికి అందిస్తున్న ఖ్యాతిని ఆస్వాదన సాహితీ సమితి (ప్రాచీన, ఆధునిక సంస్కృతాంధ్ర సాహిత్య సాంస్కృతిక వేదిక) దక్కించుకుంది. సాహితీవేత్తలు గొట్టుముక్కల వెంకట నరసింహశాస్త్రి వ్యవస్థాపక అధ్యక్షులుగాను, నేతి వెంకటరమణమూర్తి గౌరవ అధ్యక్షులుగాను, గోదావరి శ్రీరామకృష్ణమూర్తి, చిక్కాల ఆనంతలక్ష్మి, గిడుగు వేంకటాచలపతి సభ్యులుగాను 2004లో సమితిని ఏర్పాటు చేశారు. ఆధునిక నాగరికత, పరభాషా వ్యామోహం, దుష్ప్రచారాల కారణంగా అణగారుతున్న స్వభాష(తెలుగు)ను రక్షించాలనే గొప్ప ఆశయంతో సమితిని ఏర్పాటు చేశారు. ఆశయానికి అనుగుణంగా సమితి 18 సంవత్సరాల నుంచి సేవలను అందజేస్తూ సాహిత్యాభిమానుల మన్ననలు పొందుతోంది.

ఎనలేని సాహిత్యసేవ

భాషా ప్రయోజనాలను, సౌందర్యాన్ని కొత్త తరానికి అందించడంలో విశేష కృషి చేస్తోంది. యువకులను వక్తలుగా, కవులుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. బాలబాలికలతో పద్యాల కంఠస్తం చేయించి పోటీలు నిర్వహించడం, మంచి పుస్తకాల పఠనం అలవాటు చేయడం సమితి చేస్తోంది. ప్రాచీనాంధ్ర కార్యక్రమాలపై ప్రసంగాలు, అష్టావధానం నిర్వహించింది. వాల్మీకి, మహాకవి కాళిదాసు వంటి కవుల జయంతులు నిర్వహిస్తోంది. కొండేపూడి తాతబ్బాయి రచించిన 'అమ్మ శతకం, నార్ల చిరంజీవి రచించిన 'తెలుగుపూలు' వేమన, సుమతి శతక పద్యపోటీలు నిర్వహించింది. గౌరవ అధ్యక్షులుగా స్వర్గీయ దంటు సూర్యారావు, సమన్వయ కర్తగా కొరుప్రోలు గౌరినాయుడు, కార్యదర్శిగా కాకరపర్తి దుర్గాప్రసాద్ కమిటీగా 2009లో ఏర్పడిన సమితి మరిన్ని సాహిత్యసేవలతో దూసుకుపోతోంది. ఆకెళ్ళ బాలభాను, బలుసు అపర్ణ తదితరులతో అష్టావధానం కార్యక్రమాలు నిర్వహించారు. 'తెలుగు వెలుగు జిలుగులు' పేరుతో కావ్యపరంపర సాహిత్య కార్యక్రమం నిర్వహించారు. గిడుగు రచించిన గీతారత్నములు, నరసింహశాస్త్రి రచించిన మధుర మాధవం, పొదరిల్లు, వేణుగీతి వంటి పుస్తకావిష్కరణలు చేసింది. వర్తమాన రచయితలు రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తూ సమితి ప్రోత్సాహం అందజేస్తూ సాహిత్యం పట్ల యువతలో ఉత్సాహాన్ని నింపే ప్రయత్నం చేస్తోంది. 2013లో 'ఆంధ్ర సాహిత్య పరిషత్' శతజయంతి ఉత్సవాల్లో పాల్గొని వివిధ సాహిత్యసదస్సులు నిర్వహించింది. ప్రస్తుతం స్థానిక విద్యుత్‌నగర్‌లోని చల్లా జగన్నాథశాస్త్రి కల్యాణ మంటపం సమావేశపు మందిరంలో జూలై 30 నుంచి డిసెంబర్ 24వ తేది వరకు ప్రతీ ఆదివారం బమ్మెర పోతన రచించిన శ్రీమదాంధ్ర మహా భాగవతంపై ప్రసంగాల కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

తెలుగు భాష పరిరక్షణ



తెలుగును పరిరక్షించే ఉన్నత ఆశయంతో నాటి తెలుగు భాషాభిమానులు సహకారంతో ఆస్వాదన సాహితీ సమితి ఏర్పాటు చేశాం. సమితి ఆశించిన ఫలితాలు ఇస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మరిన్ని సాహిత్యసేవలు చేసేందుకు సమితి సభ్యులు సిద్ధంగా ఉన్నారు.

గొట్టుముక్కల వేంకట సత్యనరసింహశాస్త్రి, సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, కాకినాడ

యువతకు ప్రోత్సాహం



సాహిత్యం ప్రక్రియల్లో యువతను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నాం. మంచి కవులను, రచయితలను సమాజానికి పరిచయం చేసేందుకు కృషి జరుగుతోంది. యువతీయువకులను సాహిత్యంలో భాగస్వాములను చేసేందుకు సదస్సులు నిర్వహిస్తున్నాం. చిన్నప్పటి నుంచి భాషాభిమానం పెంపొందించేందుకు పద్యపోటీలు నిర్వహిస్తున్నాం.

కొరుప్రోలు గౌరినాయుడు, సమితి ఉపాధ్యక్షుడు

క్లుప్తంగా

మహిళలు ఆధ్యాత్మికంగా ముందుండాలి



ఆనందమయి మాత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రత్నప్రసాద్, రవిశంకర్ పట్నాయక్ తదితరులు

కాకినాడ రూరల్: మహిళలు ఆధ్యాత్మికంగా ముందు ఉండాలని ఆధ్యాత్మిక వేత్త రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో భారతీయ సన్యాసి, యోగా గురువు ఆనందమయి మాత వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆనందమయి మాత చిత్రపటానికి రవిశంకర్ పట్నాయక్, అడబాల రత్నప్రసాద్, రాఘవరావు, సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు. ఆనందమయి మాత బాల్యం నుంచి ఉదాసీనత, సంతోషకరమైన ప్రవర్తనతో ధ్యాన స్థితిలో ఉండేవారని, ఆమె కాంతి, శక్తి, ప్రేమ సందేశానికి పండితులు ఆకర్షితులయ్యారన్నారు. ప్రతి మానవుని అంతర్గతమైన పిలుపు స్వీయ సాక్షాత్కారాన్ని పొందడమేనని, ఆ తర్వాతే మిగిలినవని ఆమె బోధన ప్రధానాంశమన్నారు. 1982ఆగస్టు 27న ఆమె డెహ్రాడూన్‌లో కాలం చేశారన్నారు.

నేత్రదానంతో మరొకరికి కంటిచూపు



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టరు సత్యనారాయణ

కాకినాడ రూరల్: నేత్రదానం ద్వారా మరొకరికి కంటిచూపును ప్రసాదించవచ్చని డాక్టరు అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మరణానంతరం మాత్రమే కంటి నుంచి కార్నియాలను తొలగించి వివిధ కారణాలతో కంటిచూపు కోల్పోయిన వారికి అవి అమర్చడం వలన చూపు ప్రసాదించవచ్చన్నారు. సంవత్సరం వయసు నుంచి ఏ వయసు వారైనా నేత్రదానం చేయవచ్చన్నారు. ఆస్మా, మధుమేహం, రక్తపోటు, క్యాటరాక్ట్ ఆపరేషన్ వారు ఎవరైనా కూడా నేత్ర దానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, శ్రీనగేష్ రామారావు, రాఘవరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా సమగ్ర ఓటర్ల జాబితా



కాకినాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న అధికారులు

కాకినాడ రూరల్: పారదర్శకంగా సమగ్ర ఓటర్ల జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకోవాలని ఓటర్ల జాబితా పర్యవేక్షణాధికారులను కాకినాడ రూరల్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ కోరారు. సర్పవరం జంక్షన్ వద్ద తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఓటర్ల జాబితాకు సంబంధించి పర్యవేక్షణాధికారులు తహసీల్దార్ మరార్జీ, డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణ్, వేణుగోపాలాచార్యులు తదితరులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, మరణించిన వారి ఓట్లు తొలగింపులో పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

శివపదం కళాపోటీలు ప్రారంభం



జ్యోతి వెలిగిస్తున్న సంగీత విద్వాంసురాలు సూర్యకుమారి తదితరులు

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో ఋషి పీఠం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 'శివపదం' పేరుతో ఏర్పాటు చేసిన కళాపోటీలను ఆదివారం సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ట్రస్టు కన్వీనర్ చావలి రామ్మూర్తి మాట్లాడుతూ యువత అన్ని రంగాలలో రాణించాలన్నారు. ఈ పోటీలు మంగళవారం వరకు జరుగుతాయన్నారు. మొదటి రోజున విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 30 మంది జూనియర్స్, 30 మంది సీనియర్స్ పాల్గొని సామవేదం షణ్ముక శర్మ స్వరకల్పన చేసిన కీర్తనలు ఆలపించి అలరించారు. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సంగీత విద్వాంసులు ఆకొండ శ్రీనివాసరాజారావు, కేవీ బ్రహ్మానందం న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. సోమవారం నృత్యప్రదర్శన పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. రామచంద్రరావు, ట్రస్టు సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ తెలుగు ఉపాధ్యాయులకు పురస్కారాలు



పురస్కారాలు ప్రదానం చేస్తున్న వేదిక అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు

కాకినాడ కల్చరల్: స్థానిక శాస్త్రి కళాపీఠం సమావేశపు మందిరంలో సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల ప్రోత్సాహ వేదిక ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ తెలుగు ఉపాధ్యాయుల పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం జరిగింది. సభకు వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. తెలుగు భాష పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ ప్రిన్సిపాల్ పి.అన్నపూర్ణ అన్నారు. అనంతరం విద్యార్థులకు తెలుగు భాషా ఔన్నత్యంపై వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోచినపెద్ది సుబ్రహ్మణ్యం, ఎ.జ్యోతి, డి.అన్నపూర్ణ తదితర తెలుగు ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాక పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. పీఎస్ఎస్ఎస్‌పీ శాస్త్రి, రమణరావు పాల్గొన్నారు.

సూర్యనారాయణమూర్తికి వైభవంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణస్వామి

బోట్‌క్లబ్: స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సూర్యనారాయణమూర్తి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా ఆదివారం విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకొనేందుకు, అభిషేకాలు నిర్వహించేందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ వీర వెంకట సత్యనారాయణ (సత్తిబాబు) ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈఓ ఎం మురళీవీరభద్రరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆకట్టుకున్న సంగీత కచేరి



శిల్పారామంలో వయోలిన్ కచేరి చేస్తున్న బాలభవన్ విద్యార్థులు

బోట్‌క్లబ్: కాకినాడ సూర్యారావుపేట బీచ్‌లోని శిల్పారామంలో ఆదివారం రాత్రి బాలభవన్ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత కచేరి సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. బాలభవన్ పర్యవేక్షకురాలు శారద ఆధ్వర్యంలో గాత్రం, వయోలిన్, మృదంగ విన్యాసాలు వీనుల విందుగా సాగాయి. విద్యార్థులు ఆలపించిన గాత్రానికి సందర్శకులు మైమరచిపోయారు. వయోలిన్ కచేరి అలరించింది. అనంతరం విద్యార్థులకు శిల్పారామం ఏఓ ప్రకాష్ జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందించారు. విద్యార్థులు తల్లితండ్రులు, సందర్శకులు పాల్గొన్నారు.

తీరంలో పర్యాటకుల సందడి



పర్యాటకులతో సందడిగా మారిన ఉప్పాడ సాగర తీరం

కొత్తపల్లి: ఉప్పాడ సాగరతీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. పర్యాటకుల ఆటల పాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. ఉదయం లోవలోని తలుపులమ్మతల్లిని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానికి సాగర తీరానికి చేరుకున్నారు. కడలి కెరటాల్లో పిల్లలు, పెద్దలు కేరింతలు కొట్టారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎస్సై రామలింగేశ్వరరావు తన సిబ్బందితో వాహనాలను క్రమబద్ధీకరించారు.

యోగాతో మానసిక ప్రశాంతత

కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి



శిక్షణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ కల్చరల్: యోగా మానసిక ప్రశాంతతను చేకూర్చుతుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక బాలాజీ చెరువు సెంటర్‌లోని టీటీడీ కల్యాణ మంటపంలో ఆదివారం సాయంత్రం దివ్య బాలాజీ సుషుమ్న క్రియా ఫౌండేషన్, సుషుమ్న క్రియా యోగా ఫౌండేషన్ (అంతర్జాతీయ ఆధ్యాత్మిక సేవా సంస్థ) సంయుక్త ఆధ్వర్యంలో సుషుమ్న క్రియా యోగా సాధన దీక్షా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శ్రీ మహావతార్ బాబాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి అమ్మ ప్రసంగం ప్రారంభించారు. సుషుమ్న క్రియా యోగా ధ్యాన ప్రక్రియతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత చేకూరుతోందని ప్రపంచ ప్రఖ్యాత గురువులు ఆత్మానందమయి అమ్మా బోధించారు. యోగా, ధ్యానం వలన చేకూరే ప్రయోజనాలను వివరించారు. మానసిక ఒత్తిడి నుంచి ఏవిధంగా ఉపశమనం పొందాలో ఆమె వివరించారు. ఎస్.ప్రశాంతి, ఎస్.శిరిషదేవి, శుభ పాల్గొన్నారు.

నవరస కళారంగ సేవలు ఆదర్శనీయం



కార్యక్రమాన్ని ప్రారంభించిన పరిషత్ కార్యదర్శి గోపాల్, జానకీరామ్ చౌదరి తదితరులు



గమ్యస్థానాల వైపు నాటికలో ఒక సన్నివేశం

ఆకట్టుకొన్న సాంస్కృతిక ప్రదర్శనలు

కాకినాడ కల్చరల్: నవరస నాటక పరిషత్ చేస్తోన్న కళారంగ సేవలు ఆదర్శనీయని బీజేపీ నగర కన్వీనర్ గట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక దంటు కళాక్షేత్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన నవరస నాటక పరిషత్ 59వ వార్షికోత్సవాన్ని గట్టి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. పరిషత్ వ్యవస్థాపకుడు దివంగత ఎస్ఎస్ఆర్‌కే గురుప్రసాద్ కళా ప్రాంగణాన్ని ముందుగా ప్రారంభించారు. గురుప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తన తండ్రి గురుప్రసాద్ ఆశయ సాధనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పరిషత్ కార్యదర్శి గోపాల్ అన్నారు. కళాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామని పరిషత్ అధ్యక్షుడు గరికిపర్తి నమఃశ్శివాయ అన్నారు. యువతను కళారంగంలో భాగస్వాములను చేయాలని అప్పుడే కళారంగాలకు పూర్వవైభవం చేకూరుతుందని పరిషత్ ఉపాధ్యక్షుడు మార్ని జానకీరామ్ చౌదరి అన్నారు. నాటక పరిషత్ చేస్తున్న కళారంగ సేవలను సంఘసేవకులు వి.విశ్వేశ్వరావు తదితర వక్తలు కొనియాడారు. అనంతరం నాట్య భారతి నృత్యనికేతన్ విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యప్రదర్శనలు ఆకట్టుకొన్నాయి. ప్రేమానందం బృదం ఏర్పాటు చేసిన 'పద్మవ్యూహం' బుర్రకథ ప్రేక్షకులను ఆలరించింది. శ్రీసాయి ఆర్ట్స్ సమర్పణలో ప్రదర్శించిన 'గమ్యస్థానాల వైపు' నాటిక ప్రేక్షకులను ఆలోచింప చేసింది. శ్రీసాయి కార్తిక్ క్రియేషన్స్ సమర్పణలో ప్రదర్శించిన 'ఎడారిలో వాన చినుకు' నాటిక ఆకట్టుకొంది. దివంగత ఎస్ఎస్ఆర్‌కే గురుప్రసాద్ జీవిత సాఫల్య పురస్కారం రంగస్థల నటుడు టి.గాలిబ్‌కు ప్రదానం చేసి సత్కరించారు. తురగా సూర్యారావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సబ్ జూనియర్స్ తైక్వాండో జట్టు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా సబ్ జూనియర్స్ తైక్వాండో జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): తైక్వాండో సబ్ జూనియర్స్ జిల్లా జట్టును ఆదివారం ఎంపిక చేశామని జిల్లా తైక్వాండో సంఘం కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. కర్నూలులో అక్టోబరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు బాల బాలికలను చెరో 12 మందిని ఎంపిక చేశామన్నారు. ఎంపికకు సంఘ సభ్యులు రాయుడు శ్రీనివాస్, బద్రి, మహేశ్వరి తదితరులు సహకారం అందించారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ డాక్టర్ రమణ, తైక్వాండో సంఘ రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి, కోశాధికారి అబ్దుల్ తదితరులు అభినందనలు తెలిపారు.

నటుడు ప్రకాష్‌రాజ్‌ను నిషేధించాలి

బోట్‌క్లబ్: ఇస్రో శాస్త్రవేత్తలపై అనుచిత అభ్యంతర వ్యాఖ్యలు, వ్యంగ చిత్రాలను తన ట్విట్టర్ ఖాతాలో పెట్టిన సినీనటుడు ప్రకాష్‌రాజ్‌ను తెలుగు సినిమాల నుంచి శాశ్వతంగా నిషేధించాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు యార్లగడ్డ రామ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని ఆయన కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తెలుగు సినిమా పరిశ్రమ నుంచి ప్రకాష్‌రాజ్‌ను నిషేధించాలని మూవీ ఆసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణుకు, తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధ్యక్షుడు దామోదర ప్రసాద్‌కు లేఖలు రాసినట్లు చెప్పారు. దేశం యావత్తు చంద్రయాన్ ప్రయోగం విజయవంతం కావాలని పూజలు, ప్రార్థనలు చేస్తున్న వేళ ప్రకాష్‌రాజ్ శాస్త్రవేత్తలను ఉద్దేశించి ట్విట్టర్‌లో పెట్టిన వ్యాఖ్యలు, వ్యంగ చిత్రాలు దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేశాయన్నారు. బీజేపీ నాయకులు రంభాల వేంకటేశ్వర రావు, గౌతు చిన్న పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్



కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ : ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. ప్రజలు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నంబర్ 08842357800 కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10:30 నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మధ్యప్రదేశ్ అడిషనల్ డీజీపీ గాంధీభవన్ సందర్శన



గాంధీజీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న అడిషనల్ డీజీపీ జనార్దన్

కాకినాడ కల్చరల్: స్థానిక గాంధీభవన్‌ను మధ్యప్రదేశ్ అడిషనల్ డీజీపీ జి.జనార్దన్ ఆదివారం సందర్శించారు. మహాత్మాగాంధీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గాంధీభవన్ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ గాంధీభవన్ విశిష్టతను ఆయనకు వివరించారు. గాంధీజీ సేవలను ఆదర్శంగా తీసుకోవాలని అడిషనల్ డీజీపీ జనార్దన్ అన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీభవన్ అధ్యక్షులు వీఎల్ గాంధీ, అల్లూరి సురేంద్ర, ఎ.రామకృష్ణ పాల్గొన్నారు.

ఎస్పీ సతీష్‌కుమార్ తనిఖీలు

కాకినాడ క్రైం: నగరంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ శనివారం అర్ధరాత్రి విస్తృత తనిఖీలు చేపట్టారు. స్వయంగా పలు వాహనాలు తనిఖీ చేశారు. ఫుట్‌పాత్‌లు సహా పలు ప్రాంతాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తుల వివరాలను నేరుగా సేకరించారు. కాకినాడ బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్లలో పర్యటించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయా యాజమాన్యాలకు తగిన భద్రత నిర్వహించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఆయన వెంట డీఎస్పీలు, సీఐలు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నేరాలు, ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ మురళీకృష్ణ

కాకినాడరూరల్: ప్రస్తుత సమాజంలో ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని కాకినాడ రూరల్ సీఐ ఆకుల మురళీకృష్ణ అన్నారు. స్థానిక జ్యూయల్ మెడోస్ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం రాత్రి సైబర్ నేరాలు, మ్యాట్రిమోని వంటి పలు మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పిల్లలు డ్రగ్స్ బారిన పడకుండా తల్లితండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మందుకు బానిసలైతే జరిగే పరిణామాలు వివరించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై వెళ్లడం వల్ల ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఆయా కుటుంబాలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జ్యూయల్ మెడోస్ అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు కంతేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ప్రసాద్, ట్రెజరర్ వివేక్, సెక్రటరీ సత్తిబాబు, జాయింట్ సెక్రటరీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తెలుగు అధ్యాపకుడు రాముకు సన్మానం

కాకినాడ కల్చరల్: స్థానిక మల్లాడి సత్యలింగనాయకర్ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు ఎ.రామును శ్రీశ్రీ కళావేదిక సన్మానించింది. ఏలూరులోని వైఎంహెచ్ఏ హాల్‌లో వేదిక ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన హేలాపురి కవితా సంబరాలలో రామును సత్కరించారు. ఈయన గిడుగు రామ్మూర్తి పంతులుపై రచించిన కవితా గానంకు ఈ సత్కారం చేశారు. కళాశాల అధ్యాపకులు, నగర ప్రముఖులు ఈయనను అభినందించారు.

మెడికల్ రిప్స్ సంఘటితంగా ఉద్యమించాలి

కాకినాడ సిటీ: మెడికల్ రిప్స్ సంఘటితంగా ఉద్యమించి, హక్కులు కాపాడుకోవాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర జాయింట్ జనరల్ సెక్రటరీ సి.వెంకట్రావు పిలుపునిచ్చారు. ఆదివారం కాకినాడ యూటీఎఫ్ హోంలో యూనియన్ కాకినాడ బ్రాంచ్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మారిన ఉపాధి పరిస్థితులు కార్మికుల కర్తవ్యం అనే అంశంపై ప్రసంగించారు. ముందుతరం నాయకులు ఎన్నో త్యాగాలు చేసి సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్‌కు హక్కులు సాధించారని కొనియాడారు. నేటితరం ఆత్మగౌరవంతో విధులు నిర్వహించాలన్నారు. నాయకులు ఎంపీ స్వామి, దుంపల ప్రసాద్, ఏఆర్‌సీ వర్మ, చరణ్, రామకృష్ణ మాట్లాడారు. సమావేశంలో ముందుగా అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా విశిష్టమైన సేవలు అందించిన అమరజీవి డీపీ దూబేకు జోహార్లర్పించారు.

ట్రస్ట్‌బోర్డు ప్రత్యేక ఆహ్వానితుల నియామకం ?

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులుగా ఇద్దరిని నియమించినట్టు సమాచారం. వీరిలో ఒకరైన పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన ఎస్.గాంధీరెడ్డి ఆదివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. అనంతరం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు మరొకరిని కూడా ప్రత్యేక ఆహ్వానితునిగా నియమించినట్టు తెలిసింది.